క్లుప్తంగా

'బూటకపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్'



రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖానాపూర్: ప్రజలకు బూటకపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు టి.రాజగంగన్న, పట్టణ అధ్యక్షుడు గౌరీకార్ రాజు విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ ఆధ్వర్యంలో పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో నాయకులు సోమవారం రాస్తారోకో చేశారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతీ రైతుకు రైతు భరోసా సాయం కింద ఎకరాకు రూ.15వేలు ఇస్తామన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.12వేలు మాత్రమే ఇస్తామంటూ మోసం చేస్తుందన్నారు. నాయకులు మోహిద్, గజేందర్, కలీల్, వాల్‌సింగ్, గోపాల్, సుమన్, వినీస్, ప్రణీత్, గాంధీ, శేఖర్, తిరుమలేశ్, మెహరాజ్, షఫీ, వెంకటేశ్వర్‌రావు, బుచ్చాగౌడ్, ధర్మరాజు, చంద్రహాస్, మల్లేశ్, అర్షద్ ఉన్నారు.

పెంబిలో..

పెంబి: మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి నిరసన తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులుశంకర్, మల్లేశ్, విలాస్, ఇస్మాయిల్, మహేందర్, రూప్‌సింగ్, చిన్నయ్య, నరేందర్, రైతులు ఉన్నారు.

గిరిజన గ్రామాల్లో రోడ్లు నిర్మించాలి

పెంబి: మండలంలోని మారుముల అటవీ ప్రాంతంలో ఉన్న వస్పెల్లి, దోందారి, చాకిరేవు, గుమ్మెన ఎంగ్లాపూర్, అంకెన, రాయదారి, తదితర గిరిజన గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం రోడ్లు నిర్మించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మంచికంటి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గిరిజన గ్రామాల ప్రజలతో సోమవారం ఆయన సమావేశమై మాట్లాడారు. ఆదివాసీ గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించాలన్నారు. రోడ్లు లేక అనారోగ్యం బారిన పడినప్పుడు సరైన వైద్యం అందక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు సైతం ఉన్నాయన్నారు. దీంతోపాటు కడెం వాగుపై వంతెన నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆలిండియా కిసాన్ మజ్దూర్ సభ జిల్లా అధ్యక్షుడు రాజేష్, గిరిజనులు నైతం రాజు, సుదర్శన్, రాము, వసంతరావు, నర్సయ్య, రాజు పటేల్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులకు రూ.లక్ష విరాళం



ఆలయ కమిటీ సభ్యులతో వృక్షశాస్త్ర అధ్యాపకుడు రాజేందర్

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్ శ్రీ రాజరాజేశ్వర ఆలయ అభివృద్ధి పనుల కోసం గ్రామానికి చెందిన వృక్షశాస్త్ర అధ్యాపకుడు రాజేందర్ తనవంతుగా రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయం ముందు ఏర్పాటు చేసిన ఆదియోగి, మహా నంది విగ్రహాల చుట్టూ సోమవారం ఫ్లోరింగ్ వేశారు. ఆలయకమిటీ సభ్యులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాజేందర్ తల్లిదండ్రులు లక్ష్మి, చిన్నయ్య, ఆలయ కమిటీ సభ్యులు కొక్కుల లింగన్న, బరుకుంట చిన్నయ్య వడ్డే సాయన్న, పల్లికొండ లింగన్న, బుర్కా రాజేశ్వర్, కమ్మరి గంగాధర్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

లోకేశ్వరం: విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని లయన్స్ క్లబ్ రీజినల్ సెక్రెటరీ వట్టిమల్ల నర్సయ్య అన్నారు. మండలంలోని కన్కపూర్–అబ్దుల్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్మల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్టడీమెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం ప్రభాకర్, ఉపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, సదానందం, ఇంద్రసేన్‌రెడ్డి, అమృతం, ఉమ, నర్సయ్య, గంగాధర్, సుదర్శన్ ఉన్నారు.

మూఢనమ్మకాలపై అవగాహన

నిర్మల్‌రూరల్: మండలంలోని ఎల్లపల్లి గ్రామంలో రూరల్ ఎస్సై లింబాద్రి మూఢనమ్మకాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలెవరూ మూఢనమ్మకాలను నమ్మొద్దన్నారు. సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు.

పంచాయతీలకు సొంత భవనాలేవి?

- కొన్ని అద్దె భవనాల్లో నిర్వహణ
- ఇతర భవనాల్లో మరికొన్ని
- ఐదేళ్లుగా ఇదే పరిస్థితి



మాంజ్రిలో అద్దె భవనంలో కొనసాగుతున్న పంచాయతీ



కుంసరలో పాఠశాల భవనంలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ

భైంసారూరల్: మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు పూర్తిస్థాయిలో సొంత భవనాలు కరువయ్యాయి. కొన్ని పంచాయతీలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా, మరికొన్ని జీపీలు ప్రభుత్వ, ఇతర భవనాల్లో నిర్వహిస్తున్నారు. మండలంలో 30 పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 19 పంచాయతీలకు పక్కా భవనాలు ఉన్నాయి. మిగతా ఎనిమిది బిజ్జూర్, గుండేగాం, హంపోలి(కె), కుంసర, లింగా(1), సిద్దూర్, సిరాల, టాక్లి పంచాయతీలు కమ్యూనిటీ, పాత స్కూల్, ఇతర భవనాల్లో కొనసాగుతున్నాయి. మరో మూడు కుంబి, మాంజ్రి, బోరిగాం(బి) పంచాయతీలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఐదేళ్లుగా ఇదే పరిస్థితి. పక్కా భవనాలు లేక పంచాయతీల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

రికార్డులన్నీ అక్కడే..

పంచాయతీ భవనాల్లో గ్రామానికి సంబంధించిన అన్ని రికార్డులు ఉంటాయి. పక్కా భవనాలు లేక అద్దె గదుల్లో ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో రికార్డులు తడిసిపోయే అవకాశం ఉంది. చాలాచోట్ల ఈ ఘటనలు జరిగాయి. అయినప్పటికీ అధికారులు స్పందించడం లేదు. జనన, మరణాల ధ్రువీకరణపత్రాలు, వివాహానికి సంబంధించిన రిజిస్టార్లు, ఇంటి పన్నుల నిర్వహణ, నల్లా పన్నులు, గ్రామ పరిధిలో దుకాణాల లైసెన్సులు, గ్రామం పరిధిలోని ఇళ్లకు సంబంధించిన కొలతల రికార్డులు అన్నింటిని పంచాయతీల్లోనే భద్రపరుస్తారు. పక్కా భవనాలు లేక రికార్డుల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.

సమావేశాలన్నీ గ్రామాల్లోనే

గ్రామాల సమావేశాలు పంచాయతీ భవనాల్లోనే నిర్వహిస్తారు. గ్రామసభల్లో దరఖాస్తుల స్వీకరణ ఇక్కడే తీసుకుంటారు. గ్రామానికి ఏ పథకాలు మంజూరు చేసిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పంచాయతీ భవనాల్లో జరుగుతోంది. ప్రతిసారి స్థలాలు లేక ఇరుకుగదుల్లోనే సమావేశాలు నిర్వహిస్తే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పక్కా భవనాలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

మండలంలో పంచాయతీల భవనాల నిర్మాణానికి సంబంధించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. గతంలో కొన్నిచోట్ల ఉపాధిహామీ నిధులతో భవనాలు నిర్మించాం. మిగిలిన చోట్ల త్వరలోనే భవనాలు పూర్తిచేస్తాం.

– సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో

వరి పంటల పరిశీలన



కాండం తొలుచు పురుగు గుడ్ల సమూదాయాన్ని రైతులకు చూపిస్తున్న ఏవో వినోద్‌కుమార్

సోన్: మండల కేంద్రంలోని వరి పంటలను సోమవారం ఏవో వినోద్‌కుమార్ పరిశీలించారు. పంటలో కాండం తొలుచు పురుగు గుడ్ల సముదాయాన్ని గుర్తించారు. యాసంగి సీజన్‌లో వరి పంటలో మోగి పురుగు ఉధృతిని అరికట్టాలన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు 30 రోజుల్లోపు క్లోరంట్రా నిలిప్రోల్ లేదా కార్టప్ హైడ్రాక్లోరైడ్ గుళికలు చల్లుకోవాలన్నారు. మోగి పురుగు గుడ్ల నివారణకు వేప నూనె పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

రైతు నేస్తం సద్వినియోగం చేసుకోండి

రైతు నేస్తం కార్యక్రమాన్ని మండలంలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏఈవో ఉమామహేశ్వరి ఓ ప్రకటనలో కోరారు. మంగళవారం జరిగే వీడియో కాన్ఫరెన్స్‌ల యాసంగి పంట మొక్కజొన్నలో అధిక దిగుబడి సాధించేందుకు శాస్త్రవేత్తలు సూచనలు, సలహాలు ఇస్తారని పేర్కొన్నారు.

నర్సరీ నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు

తానూరు: గ్రామాల్లో ఉపాధి హామీ ద్వారా ఏర్పాటుచేసిన నర్సరీ నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నర్సరీల్లో నాటిన మొక్కలకు నీరందించాలన్నారు. కార్యదర్శులు వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని సూచించారు. గ్రామాల్లో మురుగుకాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పూర్తిచేసేలా చూడాలన్నారు. ఎంపీవో నసీరోద్దిన్, ఏపీఓ గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

దిలావర్‌పూర్: మండలంలోని గుండంపల్లి, బన్సపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శంకర్ తెలిపారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతు దృష్ట్యా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

చదువుల్లో పోటీతత్వం పెంపొందించుకోవాలి

- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి



అవార్డులు అందుకున్న విద్యార్థులతో వి.నరేందర్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: విద్యార్థులు చదువుల్లో పోటీతత్వం పెంపొందించుకోవాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. రామానుజన్ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ పాఠశాలలో గత నెల నిర్వహించిన రాష్ట్రస్థాయి అల్ఫోర్స్ గణిత మ్యాథ్స్ ఒలంపియాడ్ టెస్టులో రాణించిన నిర్మల్, నిజామాబాద్ ప్రాంతంలోని విద్యార్థులకు సోమవారం జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలని సూచించారు. ప్రిన్సిపాళ్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో సంక్రాంతి సంబురాలు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఆదర్శనగర్‌లో గల అల్ఫోర్స్ పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం హరిదాసులు, గంగిరెద్దుల కోలాహలం, విద్యార్థుల నృత్యాలు అందరినీ అలరించాయి. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



భైంసారూరల్: అవగాహన కల్పిస్తున్న పోలీసులు

భైంసాటౌన్: వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎంవీఐ ఈశ్వర్ సింగ్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సోమవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్ఎం సోలోమాన్‌రాజ్, పట్టణ ఎస్సై ఎండీ గౌసుద్దీన్‌తో కలిసి హాజరై మాట్లాడారు. డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడుపవద్దని, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ ర్యాష్ డ్రైవింగ్ చేయవద్దన్నారు. కార్యక్రమంలో డీఎం హరిప్రసాద్, ప్రయాణికులు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

భైంసారూరల్: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఏఎస్పైలు లక్ష్మణ్, మారుతి అన్నారు. మండలంలోని మాటేగాం టోల్‌ప్లాజా వద్ద వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై సోమవారం అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. పోలీసులు, వాహనదారులు తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా

హనుమాన్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

లక్ష్మణచాంద: మల్లాపూర్‌లో శివాలయం ప్రాంగణంలో హనుమాన్ విగ్రహ ఏర్పాటుకు సోమవారం గ్రామస్తులు, యూత్ సభ్యులు భూమిపూజ చేశారు. మాజీ సర్పంచ్ రాజు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

కుంటాల: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని డీఎల్పీవో సుదర్శన్ పేర్కొన్నారు. కుంటాలలో కొనసాగుతున్న సర్వేను సోమవారం పరిశీలించారు. ఇంటి, నీటి పన్నులు చెల్లించి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎంపీవో ఎంఏ రహీంఖాన్, పంచాయతీ కార్యదర్శి రాజబాపు, సిబ్బంది ఉన్నారు.

పరామర్శ

ఖానాపూర్: మహారాష్ట్రలోని కిన్వట్ మాజీ ఎమ్మెల్యే ప్రదీప్‌నాయక్ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని సోమవారం ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ పరామర్శించారు. మాజీ మంత్రి ఐకేరెడ్డితోపాటు బోథ్ మాజీ ఎమ్మెల్యే బాబురావు తదితరులతో కలిసి వారిని ఓదార్చారు.

ఉమ్మడి జిల్లా పార్లమెంటరీ సమావేశానికి తరలిన నాయకులు

లక్ష్మణచాంద: ఉమ్మడి జిల్లా పార్లమెంట్ స్థాయి కాంగ్రెస్ సమావేశానికి మండల నుంచి కాంగ్రెస్ నేతలు తరలివెళ్లారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన పార్టీ ఉమ్మడి జిల్లా పార్లమెంటరీ స్థాయి సమావేశానికి మండలం నుంచి పార్టీ అధ్యక్షుడు రాజేశ్వర్, నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు వెళ్లారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నిర్మల్‌టౌన్: భర్త వేధింపులతో ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. జిల్లా కేంద్రంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..స్థానిక మంజులాపూర్‌కు చెందిన ఓ వివాహిత భర్త, అత్తింటి వేధింపులు భరించలేక ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

చైనా మాంజాతో జాగ్రత్త

ముధోల్: సంక్రాంతి పురస్కరించుకొని గాలిపటాలు ఎగరవేయడానికి నిషేధిత చైనా మాంజా దారాన్ని ఉపయోగించొద్దని ఎస్సై సంజీవ్ ఓ ప్రకటనలో తెలిపారు. చైనా మాంజాతో జాగ్రత్త ఉండాలని పేర్కొన్నారు.

శబరిమలకు బయల్దేరిన స్వాములు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయం నుంచి సోమవారం గురుస్వామి పాకాల రాంచందర్ ఆధ్వర్యంలో స్వాములు శబరిమలకు బయల్దేదేరి వెళ్లారు.

కుంటాల: కల్లూరు నుంచి శబరి మలకు అయ్యప్ప దీక్షాపరులు సోమవారం బయలుదేరి వెళ్లారు. గురుస్వాములు రాజేందర్ రెడ్డి, నటరాజ్ ఆధ్వర్యంలో స్వాములకు ఇరుముడి కట్టారు. హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు.

అయ్యప్ప స్వాముల భిక్షాటన

కుంటాల: కుంటాలలో సోమవారం 30 మంది అయ్యప్ప స్వాములు భిక్షాటన చేశారు. స్వాములు కడార్ల హరిప్రసాద్, స్వాములు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థులకు సన్మానం

లక్ష్మణచాంద: మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులను హెచ్ఎం రాజునాయక్, ఉపాధ్యాయులు సన్మానించారు. జిల్లా కేంద్రంలో రెండురోజుల క్రితం నిర్వహించిన జిల్లాస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ పోటీలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జె.అజయ్, సిరి పాల్గొన్నారు. ఆంగ్ల విభాగంలో అజయ్ తృతీయ బహుమతి పొందగా, సిరి నాలుగవ స్థానంలో నిలిచింది. సోమవారం పాఠశాలలో వారిని సన్మానించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ఖానాపూర్: పట్టణంలోని సాయిబాబా ఆలయ 28వ వార్షికోత్సవ పోస్టర్లను కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. ఈనెల 25 నుంచి ప్రారంభం కానున్న వార్షిక ఉత్సవాలు జయప్రదం చేయాలని కమిటీ అధ్యక్షుడు అంకం రాజేందర్, సభ్యులు కోరారు. అర్చకులు పాల్గొన్నారు.

పత్తి ధర తగ్గింపు

కుభీర్: ఈనెల 8 నుంచి సీసీఐ కొనుగోలు చేసే పత్తి ధర తగ్గనుందని మార్కెట్ కార్యదర్శి గంగాధర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పత్తి క్వింటాల్ ధర రూ.7421 మాత్రమే చెల్లిస్తారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

పీఏసీఎస్‌లు ఏర్పాటు చేయాలి



లక్ష్మణచాంద: ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు



నిర్మల్‌చైన్‌గేట్: భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

లక్ష్మణచాంద: మండలంలో నూతనంగా మరో రెండు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు వడ్యాల్, ధర్మారం గ్రామాల్లో ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ మండల నాయకులు సోమవారం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లోఇందుకు స్థలం ఉందని జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే.. సహకార సంఘం సీఈఓకు ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. నాయకులు అడ్వాల రమేశ్, ముత్యం రెడ్డి, ఓస రాజు తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రిన్సిపల్ క్వార్టర్స్ నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. రూ.61 లక్షల నిధులతో పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, సత్యనారాయణగౌడ్, మెడిసెమ్మ రాజు, సాధం అరవింద్, రాజు, నరేందర్, శంకర్ పతి, కమల్ నయన్, భూపతిరెడ్డి, భాస్కర్, రమేశ్, జమాల్, విలాస్, చారి పాల్గొన్నారు.

బీజేఎల్పీ నేతను కలిసిన యువకులు

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో గురడికాపు సంఘ సభ్యులు, యువకులు, ఓమౌజయ ఆశ్రమ సభ్యులు సోమవారం బీఏఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. గురడికాపు సంఘానికి, ఓమౌజయ ఆశ్రమ ప్రాంగణంలో కమ్యూనిటీ భవనాలు మంజూరు చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ జంగం వీరేశ్, నాయకులు నిరంజన్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, సాయరెడ్డి, ఓమౌజయ ఆశ్రమ సభ్యులు పురుషోత్తమ్, భూమేశ్, ముత్యం తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను యథావిధిగా కొనసాగించాలి

సోన్: మండలంలోని గంజాల్ టోల్‌ప్లాజా కార్మికులను యథావిధిగా కొనసాగించాలని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి విన్నవించారు. ఎమ్మెల్యే తన నివాసం వద్ద సోమవారం ఆయన్ను కలిసి తమను కొనసాగించేలా చూడాలని కోరారు. టోల్ ప్లాజా మేనేజర్ ప్రణయ్ చంద్రతో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మాట్లాడగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. టోల్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన టీఎన్జీవో సంఘ సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా టీఎన్జీవో సంఘ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఆరోగ్య అలవాట్లపై శిక్షణ



శిక్షణకు హాజరైన విద్యార్థులు

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆరోగ్యకరమైన కళాశాల, ఆరోగ్య అలవాట్లు అంశంపై సోమవారం శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఐదు రోజులపాటు ప్రత్యేక సెమినార్ల ద్వారా అవగాహన కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ పి.సుదర్శన్ తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులు రాణించాలి

భైంసాటౌన్: మున్నూరుకాపులు అన్ని రంగాల్లో రాణించాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు, మున్నూరు కాపు పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్ అన్నారు. ఇటీవల పట్టణ బంగారు, వెండి వర్తక సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా గోపాల్, కోర్వ శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని మున్నూరుకాపు తాలూకా సంఘ భవనంలో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. సభ్యులు పురస్తు గోపాల్, కార్యదర్శి ఆకుల గోపాల్, కోశాధికారి తూమోల్ల దత్తాత్రి, సభ్యులు పాల్గొన్నారు.

శ్రీహరిరావును కలిసిన అల్ఫోర్స్ అధినేత

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావును అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి

కుంటాల: ఫిబ్రవరిలో నిర్వహించే శ్రీ గజ్జలమ్మ ఐదో వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హలాల్‌ను నిషేధించినట్లు ప్రకటించారు. భక్తులు సహకరించాలని వారు కోరారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల కార్యవర్గం

కుభీర్: మండల కేంద్రంలో ముదిరాజ్‌లు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిన్నబాబు, ఉపాధ్యక్షుడిగా సూరి అమృతం, కార్యదర్శిగా సట్ల శ్రీధర్, సలహాదారుగా సట్ల గంగాధర్, సూది రాజన్న ఎన్నికయ్యారు. మరో 13 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసారూరల్: మండలంలోని పేండ్‌పెల్లి గ్రామంలో ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రామారావుపటేల్ పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముత్యాలమ్మ ఆశీర్వాదంతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని దేవున్ని వేడుకున్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలకు అవసరమైన ప్రహరీ, సాంస్కృతిక స్టేజీకి నిధుల మంజూరుకు కృషిచేస్తానన్నారు. బీజేపీ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులను నియమించాలి



గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

నిర్మల్‌రూరల్: మండలంలోని అనంతపేటలో పారిశుధ్య కార్మికులను నియమించాలని గ్రామస్తులు సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. గత మూడు నెలల క్రితం విధుల్లో ఉన్న పారిశుధ్య కార్మికుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. అప్పటినుంచి గ్రామ వీధుల్లో చెత్తాచెదారం, డ్రెయినేజీల్లో నీటితో నిండి దుర్గంధం వస్తోందని వారు వాపోయారు. ఇప్పటికై నా అధికారులు పారిశుధ్య కార్మికులను నియమించాలని కోరారు. పంచాయతీ ట్రాక్టర్ బ్యాటరీని దొంగలు ఎత్తుకెళ్లారని దొంగలించారని, గత రెండు నెలలుగా ఇళ్ల ముందు చెత్త పేరుకుపోయిందన్నారు. స్పందించిన కలెక్టర్..చర్యలు తీసుకోవాల్సిందిగా డీపీవో శ్రీనివాస్‌కు సూచించారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

ఖానాపూర్: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని పోలీసులు కాపాడారు. మండలంలోని పాతఎల్లాపూర్ పంచాయతీ పరిధిలోని ఒడ్డెవాడ గ్రామానికి చెందిన బక్కన్న ఇంట్లో గొడవపడి ఆత్మహత్యకు వెళ్తున్నానని కుటుంబీకులకు ఆదివారం రాత్రి ఫోన్‌చేసి చెప్పాడు. కుటుంబీకులు డయల్ 100కు సమాచారం అందించారు. సీఐ సైదారావు చొరవతో బ్లూకోల్ట్స్ సిబ్బంది సుధీర్, సంతోష్‌లు లోకేషన్ ద్వారా 56 కి.మీ దూరంలోని పెంబి మండలం యాపల్‌గూడ అటవీ ప్రాంతానికి వెళ్లి బాధితుడి ఆచూకీని కనుగొన్నారు. బాధితుడికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబీకులకు అప్పగించారు.